సాక్షి
తిరుపతి
బుధవారం । 10 । మే । 2023



మామిడి తోటలపై ఏనుగుల దాడి

పాకాల మండలంలోని పుల్లావాండ్లపల్లి చుట్ట పక్కల ఉన్న మామిడి తోటలపై ఏనుగులు దాడులు చేస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. -8లో



ఇండోర్ స్టేడియం పనులు వేగవంతం

ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశించారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	39	26
చిత్తూరు	38	25
తిరుమల	34	21
గూడూరు	39	27
నగరి	40	26

న్యూస్‌రీల్

ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో పాలిసెట్

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం తిరుపతిలోని 8 పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్–2023 పరీక్షను నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 958 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరుకానున్నారని, వీరికి 4981001 నుంచి 4981958 వరకు హాల్‌టికెట్లను సాంకేతిక విద్యాశాఖ కేటాయించినట్లు తెలిపారు. అయితే ఈ హాల్‌టికెట్లలో పరీక్షా కేంద్రం పేరును 'ఎస్వీ ఆర్ట్స్ కళాశాల' బదులుగా 'ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల'గా ముద్రించారని, విద్యార్థులు దీనిని గుర్తించి బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,904 మంది స్వామివారిని దర్శించుకోగా.. 29,290 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.57 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పదో రోజుకు చేరిన స్వచ్ఛ యజ్ఞం

తిరుమల : టీటీడీ ఉద్యోగులు స్వచ్ఛందంగా చేపడుతున్న 'సుందర తిరుమల– శుద్ధ తిరుమల' యజ్ఞం మంగళవారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తిరుమల ఆస్థాన మండపంలో ఉద్యోగులను ఉద్దేశించి ఈఓ ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విధులను బహిష్కరించిన విపత్కర సమయంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తిరుమలను పరిశుభ్రంగా ఉంచుకోవడం హర్షణీయమన్నారు. హోదాతో సంబంధం లేకుండా అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు క్రమశిక్షణతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని కొనియాడారు. ఉద్యోగులకు తోడుగా శ్రీవారి సేవకులు కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు పది రోజుల్లో దాదాపు 5,000 మంది ఉద్యోగులు, సుమారు 2,000 మంది శ్రీవారి సేవకులు పారిశుద్ధ్య విధుల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, ఏపీఆర్వో కుమారి పి.నీలిమ తదితరులు పాల్గొన్నారు

కళాశాలల గుర్తింపునకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ప్రైవేటు, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల అఫిలియేషన్, గుర్తింపు కాల పరిమితి పొడిగింపు కోసం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోపు పూర్తి స్థాయిలో తనిఖీ చేసి నివేదికలు రాష్ట్రస్థాయి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ వారికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మొత్తంగా రెండు త్రిసభ్య కమిటీల సమన్వయంతో జిల్లాలోని 40 ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కాలేజీలను పరిశీలించాలన్నారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పారదర్శకంగా నివేదిక ఉండాలని సూచించారు. అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకట్రావు డీపీఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

డైకిన్ చైర్మన్‌కు అభినందనలు



చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న శ్రీసిటీ ఎండీ

వరదయ్యపాళెం: ప్రముఖ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ డైకిన్ ఇండియా దేశీయ మార్కెట్‌లో కీలక మిలియన్ డాలర్ల టర్నోవర్ మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కన్వల్జిత్ జావాను శ్రీసిటీలో మంగళవారం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. శీతలీకరణ పరిశ్రమలో 2023 ఆర్థిక సంవత్సరానికి ఒక మిలియన్ డాలర్ల మార్కును అధిగమించిన మొట్టమొదటి అంతర్జాతీయ కంపెనీగా డైకిన్ ఇండియా ఆవిర్భవించిందన్నారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన డైకిన్ ఇండియా ఎయిర్ కండిషనర్లు (ఏసీలు), కంప్రెషర్లు తయారుచేసే అతిపెద్ద పరిశ్రమను శ్రీసిటీలో నెలకొల్పినందుకు గర్విస్తున్నట్లు పేర్కొన్నారు.

వేషాల వేడుక



వేషాల వేడుకకు సర్వం సిద్ధమైంది. తిరుపతి తాతయ్యగుంట గంగజాతరకు చాటింపు ప్రక్రియ పూర్తికావడం.. వారం రోజుల పాటు కుల మతాలకు అతీతంగా, చిన్నాపెద్దా తేడాలేకుండా, హోదాలను పక్కనబెట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు జాతర వేషాలతో సందడి చేయనున్నారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు వేషాల జోరు కొనసాగనుంది.



పొర్లుదండాలు..వేపాకు చీర(ఫైల్)



వివిధ వేషధారణలో మొక్కు చెల్లిస్తున్న పిల్లలు

- తాతయ్యగుంట గంగమ్మ జాతర చాటింపు ప్రక్రియ పూర్తి
- నేటి నుంచి వారం రోజులు.. వేషాల జోరు
- సందడి చేయనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- తొమ్మిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన జాతరగా ప్రసిద్ధి

సాక్షి, తిరుపతి: వేషాలకు పెట్టింది పేరు.. తిరుపతి తాతయ్యగుంట గంగజాతర. తెలంగాణలో బోనాలు, సమ్మక్క, సారక్క, మేడారం జాతర్లలాగానే తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర ఒకటి. కులమతాలు లేకుండా.. కోరికలు నెరవేరిన వారు ప్రత్యేక వేషాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. తిరుమలలో శ్రీవారు స్వయంభువుగా వెలసిన సమయంలోనే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ కొలువైందని చెబుతున్నారు. పల్లవుల కాలంలో గంగమ్మ తల్లికి ఆలయాన్ని నిర్మించారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా పిలువబడుతున్న గంగమ్మకు తొమ్మిది వందల ఏళ్ల క్రితం నుంచే జాతర నిర్వహించడం ప్రారంభించారని తెలుస్తోంది. నాడు స్థానిక ఆచారాలతో ప్రారంభించిన ఈ వేడుకను నేడు రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం విశేషం. ఆచార సంప్రదాయాలతో అత్యంత వైభవంగా నిర్వహించే ఈ జాతర కోసం మంగళవారం చాటింపు నిర్వహించారు.

వేషాల వెనుక ఉన్న చరిత్ర

తాతయ్యగుంట గంగజాతర గురించి స్థానికులు ఒక కథ చెబుతుంటారు. తిరుపతిని పాలెగాళ్లు పరిపాలించే కాలంలో, ఒక పాలెగాడు తన రాజ్యంలోని అందమైన యువతులను అత్యాచారం చేసేవాడని, కొత్తగా పెళ్లైన వధువులంతా మొదటి రాత్రి తనతో గడపాలని ఆంక్షలు విధించాడని.. దాంతో, ఆ పాలెగాడిని అంతమొందించి మహిళలను కాపాడేందుకు గంగమ్మ తిరుపతికి రెండు కి.మీ దూరంలోని అవిలాల గ్రామంలో కైకాల కులంలో జన్మించిందని చెబుతున్నారు. యుక్తవయసుకు వచ్చిన గంగమ్మపై కూడా కన్నేయగా ఆమె విశ్వరూపం చూపించిందని, భయంతో పాలెగాడు పారిపోయి దాక్కుంటాడని అంటున్నారు. గంగమ్మ పాలెగాడిని వెతుకుతూ, రకరకాల మారు వేషాలు ధరించి మూడు రోజులపాటు గాలించిందట. మొదటి రోజు బైరాగి వేషం, రెండో రోజు బండ వేషం, మూడో రోజు తోటి వేషాలు వేసినా పాలెగాడు కనిపించకపోవడంతో, నాలుగో రోజు గంగమ్మ దొరవేషం వేయగానే, తన ప్రభువైన దొర వచ్చాడనుకున్న పాలెగాడు బయటకు వచ్చాడట. వెంటనే అతడిని చంపి గంగమ్మ దుష్టశిక్షణ చేసిందని భక్తులు నమ్ముతున్నారు.. గంగమ్మ ఆరోజు చేసిన దుష్టశిక్షణకు గుర్తుగా ఈ రోజుకూ తిరుపతి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ జాతర చేస్తున్నారు.

కోమటి వేషం

ఈ వేషాన్ని మిరాశీదారులైన కైకాల, చాకలి వారే వేస్తారు. కైకాల వారు ఆడవేషాన్ని, మగవేషాన్ని చాకలి వారు వేస్తారు.

తోటి వేషం

ఈ వేషంలో భాగంగా కైకాల వారు ఆడవేషాన్ని, మగవేషాన్ని చాకలి వారు వేస్తారు. చాకలి వారి చేతిలో పొడవాటి కత్తి ఉంటుంది. దీన్ని వేషాలమ్మ పాదాల చెంత ఉంచి పూజిస్తారు. స్త్రీ వేషంలో ఉన్న కైకాల వారి చేతిలో కొత్తగా తయారుచేసిన గంప (బుట్ట), మరో చేతిలో కొత్త చాటను పట్టుకుని భక్తులందరి నెత్తిన చాటతో మెల్లగా కొడుతూ ముందుకు వెళ్తారు. తోటి వేషంలో ఉపయోగించే గంప, చాట, రెండు శేషవస్త్రాలు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తిరుపతి గోవిందరాజస్వామి ఆలయానికి చేరుస్తారు. శ్రీవారు తన చెల్లె గంగమ్మకు వీటిని ఆయుధాలుగా పంపిస్తారని చెప్పుకుంటారు.

దొరవేషం

అనువంశికంగా కైకాల, చాకలి వారు వేసే వేషం. ఇందులో ఆడవేషం ఉండదు. కైకాల వారు దొరవేషాన్ని, చాకలి వారు మంత్రి వేషాన్ని వేస్తారు. పక్కనే తొటివారు పాలెగాడి వేషాన్ని వేస్తారు. ఇంకా మాతంగి, సున్నపుకుండల వేషం, పేరంటాలు, సతారాం, సుంకరి కొండడి వేషం, జల్లి కొండమనాయని వేషం, ధాష్టీక పంతులు, నూగోజీ పంతులు, నడివీధి వేషాలు, పులివేషం, పోటువేషం, నక్కలోళ్ల వేషం, పౌరాణిక, చారిత్రక వేషాలతో గెరిగాట, కీలు గుర్రాలాట, నెమలి ఆట, ఎలుంగొడ్డు ఆట, బొట్టబొమ్మలాట, మెరిగాళ్లాట, గడికొయ్యాట, పాటు వినోదాలు, తోలుబొమ్మలాట, బుర్రకథలు, హరికథలు, గుడుగుమోటారు, బొమ్మరాటలు, రంగల రాట్నాలు, శూలాలు, నిమ్మ పండ్లు గుచ్చుకోవటం, కొబ్బరి కాయలు కొట్టుకోవటం, అడుగడుగు, పొర్లు దండాలు, వేపచీరలు కట్టుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితీ.

అమ్మవారికి నైవేద్యాలు ఇలా..

జంతుబలిపై నిషేధం ఉన్నప్పటికీ ఆలయంలో ఓ మూలన మేకలు, కోళ్లు కోస్తారు. 'ఇది నార్త్ ఆర్కాట్ జిల్లాగా ఉన్నప్పుడు వేలాది మేకపోతులు, కోళ్లను గంగమ్మకు బలి ఇచ్చే వారని డిస్ట్రిక్ట్ మాన్యువల్లో బ్రిటిష్ వాళ్ళు పొందుపరిచారు. స్త్రీలు ఆలయంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. చాటింపు చేసినప్పటి నుంచి ఐదు వారాల పాటు అమ్మవారికి స్థానికులు అంబలి సమర్పించి పూజలు నిర్వహిస్తారు. కొందరు మహిళలు తమ ఇంటి నుంచి ఆలయానికి మోకాళ్లపై వచ్చి మొక్కులు చెల్లించుకోవటం గమనార్హం.



బైరాగి వేషం

దీన్ని చాటు వేషం అని కూడా పిలుస్తారు. బైరాగి వేషంతోనే జాతర ప్రారంభమవుతుంది. ఈ వేషాన్ని ఆలయం తరుపు వారు (మిరాశీదారులు) వేస్తారు. వంశపారంపర్యంగా ఈ వేషాన్ని చాకలి సామాజిక వర్గం వేయడం ఆనవాయితీ. ఒళ్లంతా బూడిద లేదా గంధం పూసుకుని, తలపాగా.. కీపాస్ పంచెకట్టుకుంటారు. నడుముకు ఎర్రని దట్టీని చుట్టుకుని మెడలో పూలహారం, చేతిలో గొడుగు ఉంటుంది.

బండ వేషం

ఇది కూడా అదేరోజు మధ్యాహ్నం నుంచి వేస్తారు. కైకాల వారు బండోళ్ల చిన్నది (స్త్రీ) వేషం, చాకలి వారు మగవేషం వేస్తారు. ఈ వేషంలో ఉన్న వారు పాటపాడుకుంటూ ముందుకు సాగుతారు.

గొల్లవేషం

దీన్నే మందడి వేషం అంటారు. ఆడవేషాన్ని కైకాల వారు, మగవేషాన్ని చాకలి వారు వేస్తారు. ఆడవేషంలో ఉన్న వారిని గంగమ్మ అంటారు.

గారడి వేషం

దీన్నే పాములోళ్ల వేషం అని కూడా అంటారు. అనువంశికంగా కైకాల వారు, రెడ్లు, చాకలి వారు ఈ వేషాన్ని వేస్తారు. కైకాల వారు ఆడవేషం, చాకలి వారు మగవేషం వేస్తారు. వీరు ఊరేగింపుగా వస్తూ నివాసాల ముందు ఆగితే ప్రజలు పూజలు చేస్తారు.

గంగమ్మ దత్తపుత్రుడు 'కరుణ'



అమ్మవారి సేవలో గణపతి సచ్చిదానంద స్వామి, ఎమ్మెల్యే



ఒడిబాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్

- గురుదత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి

తిరుపతి కల్చరల్: తిరుమల వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా, తిరుపతి గ్రామదేవతగా విశేష పూజలందుకుంటున్న అత్యంత మహిమ కలిగిన శక్తి స్వరూపిణి గంగమ్మ తల్లికి అద్భుత రీతిలో ఆలయ పునర్నిర్మాణం చేపట్టిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గంగమ్మ దత్త పుత్రుడు అని గురుదత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి కొనియాడారు. తిరుపతి గంగ జాతర నేపథ్యంలో మంగళవారం ఆయన శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనతి కాలంలోనే అద్భుత రీతిలో ఆలయ నిర్మాణం చేపట్టడం ఆషామాషీకాదని, దైవానుగ్రహం లేదనిదే ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని పరిపూర్తి చేయలేమన్నారు. ఆలయ పునఃనిర్మాణం చేపట్టాలని తలచిన కరుణాకరరెడ్డి సంకల్పానికి తిరుమల వెంకన్న, శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. నూతన ఆలయంలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మ వైభవాన్ని, విశిష్టతను దేశవ్యాప్తం చేయాలని, ఇందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఇందుకు తమ వంతుగా భాగస్వామ్యమై గంగమ్మ వైభవ వ్యాప్తికి తోడ్పడాతమని స్పష్టం చేశారు. మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు, ప్రధాన అర్చకుడు రామకృష్ణశర్మ పాల్గొన్నారు.

జాతర మొదలైంది..హో!

శ్రీతాతయ్యగుంట గంగ జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అవిలాల నుంచి మంగళవారం రాత్రి పుట్టింటి సారె వేడుకగా తీసుకువచ్చి సమర్పించారు. అవిలాల పొలిమేరలో వెలసిన గంగమ్మ గుడి వద్దకు మేళతాళాల మధ్య కోలాహలంగా సారె తీసుకొచ్చారు. అమ్మవారి సారెను అందుకునేందుకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ అధికారులు, జాతరలో వంశపారంపర్యంగా కీలపాత్ర పోషిస్తున్న కైకాల వంశీయులు అవిలాల పొలిమేరలోని గంగమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టింటి నుంచి వచ్చిన సారెను అందుకుకొని ఊరేగింపుగా శ్రీతాతయ్య గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. తర్వాత కైకాల కులస్తులు బేరి వీధికి చేరుకుని సాటింపు పూజ చేపట్టారు. అనంతరం నాటి నగర సరిహద్దులలో అష్టబంధనం చేసి జాతరమొదలయ్యిందహో.. అంటూ చాటింపు వేశారు.

నేడు గంగమ్మకు ఎమ్మెల్యే భూమన సారె

గంగజాతర సందర్భంగా తొలి రోజు బుధవారం గంగమ్మకు స్థానిక ప్రజాప్రతినిధి హోదాలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారెను సమర్పించనున్నారు. సారెను తన ఇంటి నుంచి మంగళవాయిద్యాలు, సంప్రదాయ నృత్య కళలు, వివిధ వేషధారణల నడుమ ఊరేగింపుగా తీసుకురానున్నారు. ఉదయం 8 గంటలకు పద్మావతీ పురంలోని ఎమ్మెల్యే ఇంటి నుంచి ఈ సారె ఊరేగింపు కొనసాగనుంది. భక్తుల కోసం ఎమ్మెల్యే నివాసం వద్ద ఉదయం 6 నుంచే పెద్ద ఎత్తున నాన్ వెజ్ అల్పాహారం ఏర్పాటు చేయనున్నారు.



ఎమ్మెల్యే నివాసం వద్ద భక్తుల కోసం ఏర్పాట్లు

సమస్యలుంటే 'జగనన్నకు చెబుదాం'



సమావేశంలో కలెక్టర్, జేసీ, ఎస్పీ, డీఆర్వో తదితరులు

తిరుపతి అర్బన్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జగన్నకు చెబుదాం కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నం.1902ను వినియోగించుకోవాలని చెప్పారు. ప్రధానంగా స్పందనలో వచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ స్థాయిలో ఉండే సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్వాడీ కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, నాడు–నేడు పాఠశాలలు వంటి వాటిని గ్రామ సందర్శనలో భాగంగా అధికారులు తనిఖీచేసి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకట్రావ్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐరావతంపై వేదనారాయణుని విహారం

- ఉదయం రామబంటుపై మత్స్యావతారుని విహారం
- సాయంత్రం వసంతోత్సవం

పిచ్చాటూరు: నాగలాపురంలో శ్రీ వేదనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ఐరావతంపై శ్రీ వేదనారాయణ స్వామి పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ అనంతరం దాసభక్తి ప్రతీకగా నిలిచే రామబంటును వాహనంగా చేసుకుని శ్రీవారు తిరువీధుల్లో సంచరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వాహనసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణులను ఆలయ మహామండపంలో ఆశీనులను చేసి పంచ తీర్థాలతో కూడిన సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం ఉభయనాంచారి సమేత వేద నారాయణస్వామిని శ్వేత వస్త్రధారులై తిరుచ్చిపై వసంతోత్సవంలో పాల్గొన్నారు. చందనం, పసుపు, పచ్చకర్పూరాల మిశ్రమంతో ఆలయ సిబ్బంది వసంతాలను సిద్ధం చేశారు. గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులకు ఈ సుగంధ ద్రవ్యాలతో వసంతాలు చేసి సంబరాలు నిర్వహించారు. రాత్రి గజ వాహన సేవ అనంతరం స్వామి వారు నిజాలయానికి చేరి ఏకాంతసేవలో పవళించారు.

నేడు సూర్య, చంద్ర ప్రభ వాహన సేవలు

బుధవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహన సేవ నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు ఉయ్యాలసేవ నిర్వహిస్తారు.



నాగలాపురంలో ఉదయం రామబంటుపై శ్రీహరి విహారం

కాంక్రీట్ బెడ్ వర్క్ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయ పునర్నిర్మాణం పనులను నాణ్యతా ప్రమాణాలతో చేస్తున్నట్లు పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కాంక్రీట్ బెడ్ వర్క్ పనులకు పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంక్రీట్ పని రెండు రోజుల్లో పూర్తి చేసిన అనంతరం గర్భాలయం ప్రాంతంలో రాతి బ్లాక్స్ నిర్మాణ పనులకు పూనుకుంటామన్నారు. దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను సమన్వయం చేస్తూ నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఈఈ మురళీధర్ రెడ్డి, ఏఈ కిషోర్ కుమార్, స్థపతి కుమార్, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, కాంట్రాక్టర్ యువ కిషోర్, విజయ్ భాస్కర్ రెడ్డి, దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి అదనపు బాధ్యతలు

తిరుపతి లీగల్ : రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు సెషన్స్ జడ్జి నాగరాజు తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం 3వ అదనపు జిల్లా జడ్జిగా ఉన్న వై.వీర్రాజు టీటీడీ డీఎల్‌వోగా బదిలీ కావడంతో కోర్టుకు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా జడ్జి నాగరాజు బాధ్యతలను చేపట్టారు.

క్లుప్తంగా

చేపలు మృత్యువాత



చెరువులో చనిపోయిన చేపలు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు చెరువులో గుట్టలుగుట్టలుగా చేపలు మృత్యువాత పడడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది అధికారికంగా చెరువు చేపల కోసం వేలంపాట నిర్వహించలేదు. అయితే స్థానికులు కొందరు సుమారు రూ.7 లక్షలకు అనధికారికంగా చెరువులో చేపలు పట్టుకోవడానికి వేలంపాట నిర్వహించినట్లు తెలుస్తోంది. గత మూడు రోజులుగా కలుజు, తూముల వద్ద చెరువులోని నీరంతా నల్లగా మారడం, చేపలు టన్నుల కొద్దీ మృతి చెంది ఒడ్డుకు చేరడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్న పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు కలవడం వల్ల చేపలు మృత్యువాత పడ్డాయా? లేక గుర్తుతెలియని వ్యక్తులు చెరువు నీళ్లలో విషం కలిపారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలువురు అధికారులు చెరువు వద్దకు చేరుకొని పరిశీలించి, చెరువునీటిని పరీక్షల నిమిత్తం పొల్యూషన్ నియంత్రణ కార్యాలయానికి చేరవేశారు.

- పులకించిన పల్లెలు
- పల్లెలకు వెళ్లి గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే చెవిరెడ్డి సారె సమర్పణ

జాతరో.. జాతర



సాయినగర్‌లో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



సారెను తీసుకువస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్:గంగ జాతరతో పల్లెలు పులకిస్తున్నాయి. తిరుపతి గంగమ్మ జాతర చాటింపు రోజున తిరుపతి రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో గంగ జాతర నిర్వహించడం ఆనవాయితీ. తిరుపతి నగరానికి ఆనుకుని ఉన్న పల్లెల్లో గ్రామదేవతలను పూజిస్తూ నడివీధి గంగమ్మలను కొలువుదీర్చి ప్రత్యేకంగా పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి ఏటా ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సారెను సమర్పిస్తుంటారు. ఇది గత పదేళ్లుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన తనయుడు, తిరుపతి రూరల్ ఎంపీపీ, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి గంగమ్మ జాతర్లు నిర్వహించే పల్లెలకు వెళ్లి సారెను సమర్పించారు. ముందుగా సాయినగర్ 1, సాయినగర్ 2, లింగేశ్వరనగర్ 1 లింగేశ్వర నగర్ 2, అవిలాల, శానప్ప కాలనీ, వేదాంతపురం, కేసీపేట, వడ్డిపల్లి, దుర్గసముద్రం, అచ్చన్నఇండ్లు, మల్లంగుంట, రామానుజపల్లి, గొల్లపల్లి, పాతకాల్వ, గాంధీనగర్, సి.మల్లవరం, పెరుమాళ్లపల్లి, పేరూరు, తుమ్మలగుంట గ్రామాల్లోని గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

ప్రతి పల్లెలో ఆత్మీయ పలకరింపు

గంగజాతరకు సారెను సమర్పించడానికి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి వెళ్లగా ఆయనతో కలిసి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా పర్యటించారు. ఈ క్రమంలో ప్రతి పల్లెలో మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం తర్వాత ఆలయం ముందు నైవేద్యం సమర్పించి ప్రసాదంగా పంపిణీ చేశారు. అమ్మవారికి తీసుకువచ్చిన పసుపు, కుంకుమను సంతోషంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,360
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,690
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,400
రిటైల్ వెండి గ్రాము	రూ.80.40

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తడ: రోడ్డు ప్రమాదంలో తడ, సున్నపుబట్టీ వీధికి చెందిన కొమ్మల రామచంద్రయ్య (45) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రామచంద్రయ్య సోమవారం పనినిమిత్తం బైక్‌పై చిలమత్తూరు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం శ్రీకాళహస్తి మార్గంలోని మెడిమిక్స్ పరిశ్రమ సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు షుగర్ ఫ్యాక్టరీ భూములు, ఆస్తుల వేలం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సుదలగుంట షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు, ఆస్తులను బుధవారం ఉదయం 11 గంటలకు తహసీల్దారు కార్యాలయంలో వేలం వేయనున్నట్టు తహసీల్దారు హనుమాన్‌నాయిక్ తెలిపారు. సుదలగుంట షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు బకాయిలతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి కొనుగోలు పన్ను కటాల్సి ఉన్నందున సదరు ఫ్యాక్టరీ భూములు, ఆస్తులను వేలం వేస్తున్నట్టు తెలిపారు. తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ వారు సమర్పించిన మార్కెట్ విలువతో వేలం వేస్తామన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో హేమలత ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యే హేమలత కులధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు : ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ, దళితుల మనోభావాలు దెబ్బతినే విధంగా బీసీ కులానికి చెందిన సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత నకిలీ కుల ధ్రువపత్రాలు సమర్పించి 2009లో నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యేగా గెలుపొందారని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ధ్వజమెత్తారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బీసీ కులానికి చెందినవారని, ఆమె ఎస్సీ కాదని చెప్పారు. తమవద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే హేమలతకు సంబంధించిన కళాశాల సర్టిఫికెట్లు, కబ్జా భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల పత్రాలను మీడియాకు చూపించారు. సత్యవేడు మండలం, కొత్తమారికుప్పం పంచాయతీ పరిధిలో కోట్ల రూపాయల విలువైన 14 ఎకరాల 50 సెంట్ల డీకేటీ భూమి, నాగలాపురం మండలం, సురుటుపల్లిలో ఆరెకరాల అటవీ భూమిని అడ్డగోలుగా ఆక్రమించారన్నారు. హేమలత చదివిన రాజమండ్రి కళాశాలలో ఆమెది ఆది ఆంధ్ర క్రిస్టియన్ అని సర్టిఫికెట్‌లో ఉందని, 'ఆది ఆంధ్ర క్రిస్టియన్' అన్న కులం బీసీ–సీ కిందకు వస్తుందన్నారు. నకిలీ కుల ధ్రువపత్రాలను సృష్టించుకుని ఇంతకాలం ఎస్సీగా చెప్పుకుంటూ రాణిస్తున్నారని తెలిపారు.

లేజర్ రన్ రాష్ట్ర జట్ల ఎంపిక



క్రీడాకారులతో మోడ్రన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : మోడ్రన్ పెంటాథలాన్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో లేజర్ రన్ బాలబాలికల రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో పూణెలో నిర్వహించే జాతీయ స్థాయి లేజర్ రన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రానికి పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మధు, సర్పంచ్ జ్యోతి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

బాలుర విభాగంలో..

డి.రాకేష్(విజయవాడ), వై.రోహిత్, అజితసిన్హా (గుంటూరు), మణిసాయి (కాకినాడ), బి.రాశేఖర్ (విజయనగరం), కె.రాజు, ఎస్‌కే.బాజి(ప్రకాశం),గోపిరెడ్డి, డి.హసిన్, సాయిశ్రావణ్(చిత్తూరు), హర్ష(కాకినాడ).

బాలికల విభాగంలో..

మోనిక, జ్ఞానేశ్వరి (విజయవాడ), దీప్తి (వైజాగ్), సౌజన్య, గుణశ్రీ (చిత్తూరు), ఇందుమంతి, హసిని (గుంటూరు).

నేడు తిరుమల నుంచి అలిపిరికి భవ్యహాసిని నృత్యాభినయం



మాట్లాడుతున్న కళాకారిణి తల్లి చెంచులక్ష్మి

తిరుపతి కల్చరల్: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో భాగంగా తమ కుమార్తె నల్లంగు భవ్య హాసిని బుధవారం తిరుమల నుంచి అలిపిరి వరకు మెట్ల మార్గంలో నాట్యం చేస్తూ రికార్డు నమోదు చేయనున్నట్లు ఆమె తల్లిదండ్రులు చెంచులక్ష్మి, సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నెల్లూరులో నివాసముంటున్న తమ కుమార్తె భవ్యహాసిని స్కాలర్స్, స్కాలర్స్ స్కూల్లో 7వ తరగతి చదువుతూ గత ఐదేళ్లుగా భరతనాట్యం నేర్చుకుంటోందని తెలిపారు. నృత్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాలనే ఉద్దేశంతో ఆరు నెలలుగా కఠోరమైన సాధన చేసి రికార్డుకు సన్నద్ధమైందని పేర్కొన్నారు. ఈమేరకు వైద్యులచేత హెల్త్ చెకప్‌లు పూర్తిచేసుకొని తిరుమల కొండ నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరం ఆగకుండా మెట్ల దారిన న్యాటం చేసే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. తమ బిడ్డ చేపడుతున్న సరికొత్త రికార్డు నమోదు నృత్య ప్రదర్శనకు అందరూ సహకరించాలని కోరారు.

వెకేషన్ కోర్టు షెడ్యూల్ విడుదల

తిరుపతి లీగల్: అదనపు జిల్లా జడ్జి కోర్టులు, సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు ఈనెల 15వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అత్యవసర కేసులను పరిష్కరించడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెకేషన్ కోర్టు షెడ్యూల్ విడుదల చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మొదటి పీరియడ్‌గానూ, ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రెండో పీరియడ్‌గా రాష్ట్ర హైకోర్టు విభజిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి పీరియడ్‌లో వెకేషన్ కోర్టు జడ్జిగా చిత్తూరు మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్‌ను, రెండో పీరియడ్ వెకేషన్ కోర్టు జడ్జిగా తిరుపతి 5వ అదనపు జిల్లా జడ్జి కమ్ ఫ్యామిలీ కోర్టు జడ్జి అన్వర్‌బాషాను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి షెడ్యూల్‌లో వెకేషన్ కోర్టు ఏయే తేదీల్లో ఏ ప్రాంతంలో నిర్వహించేది త్వరలో జిల్లా కోర్టు షెడ్యూల్ విడుదల చేయనుంది. అదేవిధంగా సెలవుపై వెళ్లడానికి అదనపు జిల్లా జడ్జిలకు రాష్ట్ర హైకోర్టు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామ్‌కుమార్



తీవ్రంగా గాయపడిన దిలీప్

భాకరాపేట : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం భాకరాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ప్రకాష్‌కుమార్ కథనం.. సోమల మండల కేంద్రానికి చెందిన రామ్‌కుమార్(32) సోమవారం అర్ధరాత్రి తిరుపతి నుంచి తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని నెమిలిగుండ్లు సమీపంలో రొంపిచెర్ల నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు మోటారుబైక్‌ను ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదిలావుండగా భాకరాపేట మండలం, వడ్డిపల్లెకు చెందిన దిలిప్, సునీల్‌కుమార్ ఇద్దరూ సెంట్రింగ్ పనికి రొంపిచెర్లకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని భాకరాపేటకు బయలు దేరగా.. మార్గమధ్యంలోని చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపైన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న తమిళనాడు సీజే

తిరుమల: తిరుమల శ్రీవారిని తమిళనాడు హైకోర్టు చీఫ్ జస్టిస్ టి.రాజ బుధవారం దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు ఘన స్వాగతం పలికారు.

ఇండోర్ స్టేడియం పనులు మరింత వేగవంతం

తిరుపతి తుడా: ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తిచేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత సిబ్బందిని ఆదేశించారు. తిరుపతి ఇందిరా మైదానంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. సెకండ్ ఫ్లోర్‌లో జిమ్ముకు అనువుగా ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. పనులు అలస్యంగా జరగడంపై కారణాలు చెప్పాలన్నారు. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, జిమ్నాస్టిక్స్ కోర్టులు ఉంటాయన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మోహన్, ఏయికామ్ సంస్థ భాలాజీ ఉన్నారు.

రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలి

తిరుపతి గంగజాతరకు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారికి సారె ఊరేగింపుగా తీసుకొస్తున్న నేపథ్యంలో నగరంలోని రహదారులన్నీ పరిశుభ్రంగా ఉండాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఊరేగింపు మార్గాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ హరిత లక్ష్మీపురం కూడలి వద్ద పరిశీలించారు.

మామిడి తోటలపై ఏనుగుల దాడి



మామిడి తోటల్లో ఏనుగుల అడుగులు

పాకాల: మండలంలోని పుల్లావాండ్లపల్లి చుట్టు పక్కల ఉన్న మామిడి తోటలపై రెండు రోజులుగా ఏనుగులు దాడులు చేస్తున్నట్టు స్థానిక రైతులు వాపోతున్నారు. మంగళవారం పలువురు రైతులు మాట్లాడుతూ రాత్రి పూట కాకర్లవారిపల్లి చుట్టు పక్కల మామిడి తోటల్లో ఏనుగులు సంచరిస్తూ మామిడి పంటను నాశనం చేస్తున్నాయని వాపోయారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న భాకరాపేట స్థానికులు

భాకరాపేట : ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ భాకరాపేటకు చెందిన పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం భాకరాపేటకు చెందిన తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని సర్వే నంబరు 329లో 110 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని తెలిపారు. ఆ భూముల్లో గత తహసీల్దార్ హనుమాన్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్డులను సైతం పెకలించి వేశారని తెలిపారు. టీడీపీకి చెందిన నాయకులు ఈ ఆక్రమణలకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

తిరుపతి క్రైమ్: హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. ఈ సంఘటన తిరుపతి నగరంలోని ఓ హోటల్ వద్ద చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ ఇమ్రాన్ బాషా తెలిపిన వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన విజయ్ కుమార్(38) సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీ శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి వచ్చి మంగళం రోడ్డులోని ఓ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. రెండు రోజుల పాటు పూటుగా మద్యం సేవించి గదిలోనే ఉండిపోయాడు. అనుమానం వచ్చిన హోటల్ సిబ్బంది మాస్టర్ కీతో మంగళవారం అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రెండు రోజుల నుంచి తాగడం వల్ల చనిపోయి ఉంటాడని ప్రాథమిక అంచనాకొచ్చారు. ఆధార్ కార్డు ఆధారంగా వారి కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న సీఐ

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆన్‌లైన్ మోసాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని చంద్రగిరి సీఐ ఓబులేసు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న శాంతిభద్రతల పరిస్థితులపై ఆరా తీశారు. ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.